# దారుణ దారులు

- తాజా వర్షాలకు శిథిలమైన రోడ్లు
- పలుచోట్ల తవ్వి వదిలేయడంతో బురదమయం.. ప్రమాదాలకు నిలయం
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు



వరాహగిరి కాలనీ-2కి వెళ్లే ప్రధాని రహదారిని ఆనుకుని తవ్వేయడంతో ఇరుగ్గా మారిన రోడ్డు



వరాహగిరి కాలనీ రోడ్డు పక్క నుంచి తవ్వడంతో ప్రమాదకర స్థితిలో విద్యుత్ స్తంభాలు

తాటిచెట్లపాలెం: నియోజకవర్గంలోని పలు రహదారులు దారుణంగా తయారయ్యాయి. పలు ప్రాంతాల్లో వివిధ పనుల నిమిత్తం రహదారులను అస్తవ్యస్తంగా తవ్వి వదిలేయడంతో తాజాగా కురిసిన వర్షాలకు మరింత బురదమయంగా.. ప్రమాదాలకు నిలయంగా మారాయి. చిన్న చిన్న రోడ్లు మాత్రమే కాకుండా ప్రధాన రహదారులదీ ఇదే పరిస్థితి. దీంతో స్థానిక ప్రజలు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**రాకపోకలకు తంటాలు**

జీవీఎంసీ 42, 43 వార్డుల పరిధిలోని తాటిచెట్ల పాలెం 80 ఫీట్ రోడ్డు నుంచి రైల్వే న్యూకాలనీకి వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా తయారైంది. 80 ఫీట్ రహదారి నుంచి రామాలయం బజార్, మసీదు జంక్షన్ వరకు వివిధ పనుల నిమిత్తం తవ్వేశారు. వెంటనే పూర్తి చేయాల్సిన ఈ పనులు నత్తనడకన సాగుతుండటంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతి రోజు వందలాది వాహనాలు, నిత్యం అధిక సంఖ్యలో ప్రజలు, విద్యార్థులు తమ విధులకు, విద్యాలయాలకు, వ్యాపారాలకు ఇదే రహదారిని వినియోగిస్తుంటారు. ఈ మార్గంలో పలు స్కూళ్లు, శివాలయం, ఆంజనేయ స్వామి, వినాయక ఆలయాలు, మసీదు వంటి పలు ప్రార్థనా మందిరాలున్నాయి. నిత్యం ప్రజలు ఇక్కడికి వచ్చి వెళ్తుంటారు. అటువంటి ప్రధాన రహదారి కొన్ని నెలలుగా శిథిలావస్థలో ఉండటంతో ప్రజలు రాకపోకలకు నానా తంటాలు పడుతున్నారు. ఈ రహదారిని తవ్వి దానిని పూర్తి చేయకుండా వదిలేయడంతో అక్కడక్కడ గోతులు, వర్షం కారణంగా బురద పేరుకుపోయి ప్రమాదాల బారిన పడుతున్నారు. తాటిచెట్ల పాలెం రాజీవ్‌గాంధీ విగ్రహం జంక్షన్ వద్ద డంపర్ బిన్ ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో రోడ్డు గతుకులమయంగా ఉంది. వీటిలోకి డంపర్ బిన్ వ్యర్థ నీరు, వర్షపు నీరు చేరి దుర్గంధం వెదజల్లుతోంది. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి రహదారులను బాగుచేయాలని స్థానికులు కోరుకుంటున్నారు.

**ప్రమాదకరంగా కొండవాలు రహదారి**

జీవీఎంసీ 45వ వార్డు వరాహగిరి కాలనీ-2 కొండవాలు ప్రాంతానికి వెళ్లే ప్రధాన రహదారిని ఇటీవల కేబుల్ పనుల నిమిత్తం తవ్వేశారు. ఇది ప్రమాదకరంగా తయారైంది. సుమారు 10 అడుగుల ఎత్తులో తవ్వకాలు జరిపారు. దీంతో ఈ రోడ్డు, దాని మీద ఉన్న విద్యుత్ స్తంభాలు, తీగలు ఎప్పుడు పడిపోతాయా అన్నట్లుగా పరిస్థితి నెలకొంది. ఇక్కడ ఉన్నది కేవలం 10 అడుగుల రోడ్డు.. అది కూడా ఇపుడు ఇరుగ్గా మారిపోయింది. రాత్రయితే ఈ రోడ్డు మరింత ప్రమాదకరంగా ఉంటోందని కొండవాలు నివాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి త్వరితగతిన పనులు పూర్తిచేసి ప్రజల ఇబ్బందులు తొలగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



రైల్వే న్యూకాలనీ శివాలయం ముందు బురదమయంగా ప్రధాన రహదారి



న్యూకాలనీ బజార్ ప్రాంతంలో బురదతో నిండిన గోతుల రోడ్డు



తాటిచెట్లపాలెం హైవే పక్కన తవ్వి అసంపూర్తిగా వదిలేసిన సర్వీస్ రోడ్డు

## గుంతలమయంగా ప్రధాన రహదారులు



కంచరపాలెం - తాటిచెట్లపాలెం ప్రధాన రహదారిలో ధర్మానగర్ వద్ద గుంతలమయంగా బీటీ రోడ్డు

కంచరపాలెం: కంచరపాలెం నుంచి తాటిచెట్లపాలేనికి వెళ్లే ప్రధాన రహదారిలో నల్ల తారు ఊడిపోయి గుంతలమయంగా తయారైంది. తాజాగా కురిసిన భారీ వర్షాలకు రహదారుల్లోని గోతులు నీటితో నిండి చెరువులను తలపిస్తున్నాయి. రాళ్లు తేలిన రోడ్లపై రాకపోకల సమయంలో ప్రమాదాల బారిన పడుతున్నామని ద్విచక్ర వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి రోడ్డు రైల్వే పరిధిలో ఉండటంతో జీవీఎంసీ అధికారులు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయలేదు. దీంతో ఈ రహదారిలో రాత్రి వేళ చీకట్లు కమ్ముకుని ప్రమాదాలు జరుగుతున్నాయి. మూడేళ్ల కిందట వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అభివృద్ధి చేసిన రహదారులకు గతేడాది కూటమి ప్రభుత్వంలో కొత్త రోడ్లు వేసినట్లు డబ్బాలు కొట్టుకుని అక్కడక్కడ పడిన గోతులను పూడ్చారు. ఈ పనులు చేపట్టిన నాలుగు నెలలకే నాణ్యత డొల్లగా మారడంతో రహదారులు భారీ గోతులమయంగా మారాయి. అటుగా రాకపోకలు సాగించే వారు గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి దెబ్బతిన్న రహదారులకు తక్షణం మరమ్మతులు చేపట్టాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు.

**పాలకుల నిర్లక్ష్యం**



కంచరపాలెం-తాటిచెట్లపాలెం ప్రధాన రహదారి రాళ్లు తేలి అధ్వానంగా తయారైంది. ధర్మానగర్‌కు వెళ్లే మార్గం గుంతలతో నిండిపోయింది. వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. పాలకులు పట్టించుకోకపోవడంతో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ సమస్యపై కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్‌లకు ఫిర్యాదు చేస్తాం. స్పందించని పక్షంలో గుంతల రహదారుల వద్ద రాస్తారోకో చేపట్టి నిరసన తెలియజేస్తాం.

– గంటా కామరాజు, వైఎస్సార్‌సీపీ నాయకుడు

## క్లుప్తంగా

### గెడ్డ శుభ్రతకు చర్యలు



రైల్వే న్యూకాలనీలో గెడ్డను శుభ్రం చేస్తున్న పారిశుధ్య సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

తాటిచెట్లపాలెం: గెడ్డలు పూడికలతో నిండి వర్షాల సమయంలో పొంగి పొర్లుతున్న సమస్యపై 'వానొస్తే.. నరకం' అనే శీర్షికన ఈ నెల 19న 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి జీవీఎంసీ అధికారులు స్పందించారు. వ్యర్థాలతో నిండిపోయి ప్రవాహానికి ఇబ్బందిగా మారిన రైల్వే న్యూకాలనీ గెడ్డను పారిశుధ్య సిబ్బంది శుభ్రం చేశారు. ఈ గెడ్డలో పూర్తిగా చెత్తాచెదారం పేరుకుపోయి కల్వర్టును ఆక్రమించేశాయి. మంగళ, బుధవారాల్లో అధికారులు సిబ్బందిని నియమించి మాన్యువల్‌గా ఈ గెడ్డను శుభ్రం చేయించారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

### గజల్ ప్రక్రియలో రచనలు రావాలి



ప్రసంగిస్తున్న గజల్ కవి చల్లా రాంబాబు

సీతంపేట: గజల్ ప్రక్రియను తెలుగులో మొట్టమొదట దాశరథి ప్రారంభించారని గజల్ కవి, కథా రచయిత చల్లా రాంబాబు అన్నారు. సహృదయ సాహితి ఆధ్వర్యంలో స్థానిక ప్రిజమ్ కళాశాలలో బుధవారం జరిగిన గజల్ మాధురి కార్యక్రమంలో ఆయన ప్రధాన వక్తగా ప్రసంగించారు. గజల్ ప్రక్రియ అరబిక్ పర్షియా ఉర్దూ భాషల నుంచి తెలుగులోకి ఎలా పరిణామక్రమం చెందిందో వివరించారు. తెలుగులో గజల్ ప్రక్రియను దాశరథి ప్రారంభించారని, తర్వాత సి.నారాయణరెడ్డి సామాజికాంశాలతో రచించి విస్తృత పరిచారన్నారు. నారాయణరెడ్డి తర్వాత తెలుగులో గజల్స్ తానే రాశానని తెలిపారు. ఈ ప్రక్రియలో రచనలు మరిన్ని రావాలని, గజల్స్ రాయాలన్న ఔత్సాహికులు తనని సంప్రదించవచ్చన్నారు. సభాధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ ఉర్దూ కవిత్వంలో గజల్ రచనా పద్ధతి వందేళ్ల క్రితం ప్రారంభమైందన్నారు. కార్యక్రమంలో కవులు సిహెచ్.చినసూర్యనారాయణ, కె.వి.ఎస్.మూర్తి, బి.రాధారాణి, కుప్పిలి భీమేశ్వరరావు, కొత్తూరు రమణ, పరమేశ్వరరావు, శివాజీ పాల్గొన్నారు.

### అనుకూలాంశాలతోనే ఉత్పత్తి నాణ్యత

మురళీనగర్: వస్తువుల రూపకల్పనలో (డిజైన్) అనుకూలాంశాలు కీలకమని ల్యాబ్‌కార్ప్ డైరెక్టర్ డాక్టర్ మల్లికార్జున్ కొరిపాడు అన్నారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరుగుతున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో భాగంగా 'డిజైన్ ఫర్ మాన్యుఫాక్చరబిలిటీ అండ్ డిజైన్ ఫర్ అసెంబ్లీ' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. వస్తువుల రూపకల్పన దశలోనే సమస్యలను గుర్తించడం ద్వారా తక్కువ ఖర్చుతో, నాణ్యమైన ఉత్పత్తులను తయారు చేయవచ్చని వివరించారు. అనంతరం గీతం యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ ప్రేమ్ కుమార్ సింగ్ 'డిజైన్ అండ్ థింకింగ్ అండ్ ఇట్స్ మ్యాథమెటికల్ మోడలింగ్' అనే అంశంపై మాట్లాడారు. గణిత మోడలింగ్ సహాయంతో సంఖ్యాత్మక సమస్యలను గుర్తించి, వాటిని సమన్వయం చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ డాక్టర్ పి.ఎం.భాషా అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్, కో-కోఆర్డినేటర్ డాక్టర్ సీహెచ్ రాజు, ఎం.భరణి పాల్గొన్నారు.

### 'ఎంఎస్ఎంఈ పథకాలను సద్వినియోగం చేసుకోండి'

ఎంవీపీ కాలనీ: వ్యాపారవేత్తలు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఎంఎస్ఎంఈ స్కీమ్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిశ్రమల కేంద్రం (డీఐసీ) జనరల్ మేనేజర్ ఆదిశేషు కోరారు. ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఉమెన్ ఎంట్రప్రెన్యూర్స్, టీమ్ ఇండస్ట్రీస్ కన్సల్టెన్సీ సర్వీసెస్ సంయుక్తంగా 'అగ్రో అండ్ ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్' అనే అంశంపై ఎంవీపీ కాలనీలోని భద్రం పార్క్ వేదికగా నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం సింగిల్ విండో పద్ధతిలో ఔత్సాహిక వ్యాపారవేత్తలకు అవసరమైన అన్ని సేవలను అందిస్తోందన్నారు. సీఎం చంద్రబాబు సూచనల మేరకు ప్రతి నియోజకవర్గం నుంచి వెయ్యి మంది వ్యాపారవేత్తలను తీర్చిదిద్దేలా కృషి చేస్తున్నామన్నారు. అనంతరం ఎంఎస్ఎంఈ వర్గీకరణ, ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలపై సమగ్ర అవగాహన కల్పించారు. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఉమెన్ ఎంట్రప్రెన్యూర్స్ అధ్యక్షురాలు, ఏపీ చాంబర్స్ ఉమెన్ వింగ్ చైర్‌పర్సన్ డాక్టర్ గీతా శ్రీకాంత్ మాట్లాడుతూ ఆగ్రో అండ్ ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో కొత్త వ్యాపార అవకాశాలు పుష్కలంగా ఉన్నాయన్నారు.

## 98.86 శాతం మందికి ఆల్బెండజోల్ మాత్రలు



చిన్నారికి ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: నులిపురుగుల నివారణలో భాగంగా బుధవారం మాపప్ రౌండ్ నిర్వహించారు. బర్మా క్యాంప్, భానోజీనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం, జైభారత్ నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు చేతుల మీదుగా నులి పురుగుల నివారణ మాత్రలను మింగించారు. ఇక్కడ ఈ నెల 12న 18 మంది చిన్నారుల్లో 16 మంది వేసుకోగా.. బుధవారం మిగిలిన ఇద్దరు చిన్నారులకు మాత్రలు వేశారు. జిల్లాలో 1 నుంచి 19 ఏళ్ల వయసు గల బాలబాలికలు 5,15,264 మంది ఉండగా.. ఇప్పటి వరకు 5,14,544 మంది చిన్నారులకు ఆల్బెండజోల్ టాబ్లెట్లను మింగించారు. ఈ మాపప్ రౌండ్‌లో 1.87 శాతం మంది పిల్లలకు మాత్రలు వేశారు. దీంతో జిల్లాలో మొత్తం 98.86 శాతం మంది పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు వేసినట్టు డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మీడియా విస్తరణాధికారి బి.నాగేశ్వరరావు, ఇతర వైద్యులు పాల్గొన్నారు.

## 23న సివిల్ సర్వీసెస్‌పై అవగాహన సదస్సు

సీతంపేట: సివిల్ సర్వీసెస్ పరీక్ష ప్రిపరేషన్‌పై ఈ నెల 23న ఉదయం 10 గంటలకు ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఉచిత అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు ఏకం ఐఏఎస్ అకాడమీ సంస్థ ప్రతినిధి శశి ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్ సర్వీసెస్ వైపు అడుగులు వేస్తున్న విద్యార్థులకు మార్గదర్శకం చేయడానికి, సందేహాల నివృత్తికి ఈ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రిటైర్డ్ మేజర్ ఎస్‌పీఎస్ ఒబెరాయ్ ముఖ్య అతిథిగా పాల్గొని సివిల్ సర్వీసెస్‌కు ఎలా ప్రిపేర్ అవ్వాలి, యూపీఎస్సీ పరీక్షా విధానం, టైం మేనేజ్‌మెంట్, రివిజన్ పద్ధతులు, ప్రస్తుత వ్యవహారాల ప్రాముఖ్యత, విజయానికి కావలసిన మైండ్ సెట్ తదితర విషయాలపై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. డిగ్రీ ఫైనలియర్ విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు సదస్సుకు హాజరు కావచ్చన్నారు. విద్యార్థులు 81210 27337 నంబర్‌లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

## అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

మర్రిపాలెం: బహిరంగ ప్రదేశాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని కంచరపాలెం ఐదో పట్టణ సీఐ రవికుమార్ హెచ్చరించారు. బుధవారం సాయంత్రం పలు ప్రధాన కూడళ్లలో సిబ్బందితో కలిసి విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. తాటిచెట్లపాలెం జంక్షన్ వద్ద బహిరంగంగా మద్యం తాగిన వారిని పట్టుకుని కేసులు నమోదు చేశారు. శాంతిభద్రతలకు భంగం కలిగించేలా ప్రవర్తిస్తే చర్యలు తీసుకుంటామని, ప్రజల భద్రతను దృష్టిలో పెట్టుకుని నేరాల నియంత్రణ కోసమే విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, ఎవరైనా అనుమానితులను గుర్తించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని స్థానికులను కోరారు. అటువంటి వారిపై కఠినంగా వ్యవహరిస్తామని సీఐ హెచ్చరించారు. నిత్యం సమస్యాత్మక ప్రాంతాల్లో ఈ డ్రైవ్ కొనసాగుతుందని చెప్పారు.




విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తున్న కంచరపాలెం సీఐ రవికుమార్

## సత్యానగర్ కొండవాలులో జెడ్సీ పర్యటన



గోడ కూలిన సంఘటన గురించి అడిగి తెలుసుకుంటున్న జెడ్సీ రాము



సత్యానగర్‌లో కొండచరియలు విరిగిపడిన ప్రాంతం

మురళీనగర్: జీవీఎంసీ 50వ వార్డు కొండవాలు ప్రాంతం సత్యానగర్‌లో బుధవారం జోన్-5 కమిషనర్ రాము పర్యటించారు. మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఈ ప్రాంతంలో గోడ కూలి కొండచరియలు విరిగి పడిన విషయం తెలుసుకున్న ఆయన పోలీసు అధికారులతో కలిసి సంఘటన ప్రాంతాన్ని సందర్శించారు. గోడ కూలిన ప్రాంతంలో రక్షణ గోడ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని జెడ్సీ తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ 50వ వార్డు అధ్యక్షుడు ఎస్.వరప్రసాద్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## కూటమి పాలన మోసపూరితం



తారకరామానగర్‌లో చంద్రబాబు మోసాలను వివరిస్తున్న పైడి రమణ, పార్టీ నాయకులు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డులో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ ఆధ్వర్యంలో బుధవారం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. వార్డులోని ప్రిన్స్ అపార్ట్‌మెంట్, తారకరామానగర్ కాలనీ-1, 2, గణేష్‌నగర్ ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన మోసపూరిత హామీలను, అమలు చేయలేని తీరును ప్రజలకు వివరించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ప్రజలు నష్టపోయిన పథకాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకు లు హరిపట్నాయక్, నానిబాబు, నాగరాజు, దుర్గేష్, గణపతి, నాయుడు, నేపాల్ శ్రీను, సతీష్, ముప్పిడి రామారావు, మాత ఈశ్వరరావు, బత్తుల హరి, మహేష్, సీతారామ్, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

### ఉత్పత్తి తగ్గడానికి ఉక్కు యాజమాన్యానిదే బాధ్యత

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో మూడు రోజులుగా బ్లాస్ట్ ఫర్నేస్‌లో ఉత్పత్తి తగ్గడానికి ఉన్నత యాజమాన్యమే బాధ్యత వహించాలని స్టీల్ సీఐటీయూ అధ్యక్షుడు వై.టి.దాస్ అన్నారు. ఈ సమస్యకు కింది స్థాయి అధికారులను, కార్మికులను బాధ్యులను చేయడం సరికాదని పేర్కొన్నారు. ఉత్పత్తిని పెంచుతామని, లాభాల్లో నడుపుతామని ప్రకటించిన ప్రభుత్వం, యాజమాన్యం ఇప్పుడు ఉత్పత్తి ఎందుకు తగ్గిందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రా మెటీరియల్ హ్యాండ్లింగ్ ప్లాంట్‌లో పాడైన యంత్రాలను ఎందుకు మార్చలేదని ప్రశ్నించారు. కన్వేయర్ల నిర్వహణను ప్రైవేటుపరం చేసిన 'టీఎంసీ' ఎందుకు విఫలమైందో వివరించాలన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఆర్ఎంహెచ్‌పీ విభాగంలో ముడి సరుకు సరఫరా నిలిచిపోయిందని, కాంట్రాక్ట్ కార్మికులు లేకపోవడమే దీనికి కారణమన్నారు.

## కొమ్మలు తొలగించారు.. చెట్టును వదిలేశారు

సాక్షి ఎఫెక్ట్..



లలితానగర్‌లో కూలే స్థితిలో ఉన్న చెట్టు కొమ్మలు తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు లలితానగర్‌లో కూలడానికి సిద్ధంగా ఉన్న చెట్టును తొలగించమని స్థానికులు కోరుతుంటే.. దానికి అనుమతి లేదంటూ కేవలం కొమ్మలను మాత్రమే జీవీఎంసీ హార్టికల్చర్ సిబ్బంది బుధవారం తొలగించారు. లలితానగర్‌లో తిరుపూర్ గార్మెంట్స్ వద్ద చెదలు పట్టి ఒక చెట్టు కూలే స్థితిలో ఉండటంతో స్థానికుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై 'ప్రమాదకరంగా చెట్టు' అనే శీర్షికన బుధవారం 'సాక్షి'లో ప్రచురించిన వార్తకు జీవీఎంసీ హార్టికల్చర్ విభాగం అధికారులు స్పందించారు. అదే రోజు ఉదయం సిబ్బంది వచ్చి కూలడానికి సిద్ధంగా ఉన్న చెట్టు కొమ్మలను తొలగించారు. చెట్టును పూర్తిగా తొలగించడానికి అనుమతి లేదని కేవలం కొమ్మలు మాత్రం తొలగించి వెళ్లిపోయారు. చెట్టు మొదలు చెదలు పట్టి బాగా పుచ్చిపోయిందని, వర్షాల ధాటికి, గాలికి చెట్టు కూలే ప్రమాదముందని, పూర్తిగా తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

## సమస్యల పరిష్కారానికి మానవహారం నేడు

మర్రిపాలెం: ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించాలని దేశవ్యాప్తంగా అఖిల భారత అంగన్‌వాడీ యూనియన్ బ్లాక్‌డే నిర్వహిస్తున్నట్టు ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ యూనియన్ నాయకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం 5 గంటలకు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద మానవహారం నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని, ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని, ప్రధాన మంత్రి మాతృత్వ వందన యాప్ భారం తగ్గించాలని కోరుతూ మానవహారం చేపడుతున్నట్లు చెప్పారు. పెద్ద ఎత్తున అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొంటారన్నారు.

## కిమ్స్ ఐకాన్‌లో బాలుడికి అరుదైన శస్త్రచికిత్స



బాలుడి కాలేయం నుంచి తొలగించిన కణితి

తాటిచెట్లపాలెం: ఆడుతూ.. పాడుతూ చక్కగా చదువుకునే పదహారేళ్ల వయసులో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న అనకాపల్లికి చెందిన బాలుడు విపరీతమైన కడుపు నొప్పితో బాధపడుతూ, తరచూ జ్వరం బారిన పడి నీరసించిపోయాడు. నెల రోజుల నుంచి పలు ఆస్పత్రుల్లో బాలుడిని తల్లి దండ్రులు చూపించగా.. కాలేయంలో ఇన్ఫెక్షన్ ఉందని మందులు వాడారు. ఫలితం లేకపోవడంతో సీతమ్మధారలోని కిమ్స్ ఐకాన్ హాస్పిటల్‌కు ఇటీవల బాలుడిని తీసుకొచ్చారు. అప్పటికే బాలుడి కడుపు బాగా ఉబ్బిపోయి ఉంది. వైద్య పరీక్షలు చేయగా కాలేయ క్యాన్సర్ (హెపాటిక్ యాంజియో మైలోలిపోమా) అని తేలింది. ఇది కాలేయంలో కుడివైపు దాదాపు సగభాగాన్ని ఆక్రమించి, సుమారు ఫుట్‌బాల్ అంత సైజులో ఉంది. సీటీ, ఎంఆర్ఐ స్కాన్‌లను చేసి కణితి ఎక్కడి నుంచి ఎక్కడ వరకు ఉంది, ఏయే భాగాలకు విస్తరించింది, ఏ స్థాయిలో ఉందో వైద్యులు తెలుసుకున్నారు. అనంతరం శస్త్రచికిత్స చేసేందుకు నిర్ణయించారు. దాదాపు ఆరున్నర గంటలు శ్రమించి ఎటువంటి ఇబ్బంది లేకుండా కణితిని తొలగించారు. దీని బరువు సుమారు 4.5 కిలోలు ఉన్నట్లు వైద్యులు తెలిపారు. బాలుడి వయసును దృష్టిలో ఉంచుకుని మిగిలిన కాలేయానికి ఏ విధమైన హాని కలుగకుండా పూర్తిస్థాయిలో, కచ్చితత్వంతో శస్త్రచికిత్స చేసినట్లు డాక్టర్ మురళీధర్ తెలిపారు. సర్జరీ అనంతరం బాలుడు వేగంగా కోలుకోవడంతో ఐదో రోజునే డిశ్చార్జి చేశామని, ప్రస్తుతం కీమోథెరపీ ఆరు సైకిల్స్ కూడా విజయవంతంగా పూర్తి చేసుకుని తన రోజువారీ కార్యకలాపాలను యథావిధిగానే బాలుడు చేసుకోగలుగుతున్నాడని వైద్యులు తెలిపారు.

## అంతర్జాతీయ పారా వాలీబాల్ పోటీలకు ఎంపిక



మాట్లాడుతున్న పారా వాలీబాల్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ప్రెసిడెంట్ శివదత్

సీతంపేట: అమెరికాలో అక్టోబర్ 12 నుంచి 18 వరకు జరగనున్న అంతర్జాతీయ పారా వాలీబాల్ వరల్డ్ కప్ పోటీలకు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన దివ్యాంగులైన అన్నం గణేష్, వేల్పుల విజయ్ కుమార్ ఎంపికయ్యారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో పారా వాలీబాల్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు బోడపాటి శివదత్ వివరాలు వెల్లడించారు. బెంగళూరులో ఇటీవల జరిగిన సిట్టింగ్ వాలీబాల్ పోటీల్లో అద్భుతమైన ప్రతిభ కనబరిచి, ఈ ప్రపంచ స్థాయి పోటీలకు వారు అర్హత సాధించారని శివదత్ తెలిపారు. గతంలో పారా వాలీబాల్ విభాగంలో విజయనగరానికి చెందిన దివ్యాంగురాలు బి. వరలక్ష్మి గెలుపొందారని గుర్తు చేశారు. సమావేశంలో అసోసియేషన్ కోశాధికారి జంపా నాగసంతోష్ రావు, డైరెక్టర్లు దుండంగి స్వరూప్, చుక్కా గణేష్ పాల్గొన్నారు.